క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్):విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు జన్మదినం పురస్కరించుకుని శనివారం ముదిరాజ్ కార్పొరేషన్, నాగవంశం కార్పొరేషన్ ఆధ్వర్యాన నిర్మల హృదయ్ భవన్‌లో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నాగవంశం డైరెక్టర్ కాళ్ళ ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం క్లస్టర్–2 ఇన్‌చార్జి కంభం కొండలరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆశయసాధనకు అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. నిర్మల హృదయ్ భవన్‌లో వృద్ధులతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం సుమారు 100 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గజ్జలకొండ వాసు, కె.శ్రీనివాస్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకు సన్మానం




మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎమ్మెల్యే, ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు బెజ్జం రవికుమార్, గుడిసే శ్యాంబాబు, ప్రజా కాపునాడు అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు, మైనార్టీ నాయకులు నాగుల్‌మీరా మల్లాది విష్ణును శాలువాతో సత్కరించారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత



మధురానగర్(విజయవాడసెంట్రల్):అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సత్యనారాయణపురం కేంద్రీయ విద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ కాంపిటీషన్ జరిగింది. అయోధ్యనగర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ అలోక్ కుమార్ కాశ్యప్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మానసిక ప్రశాంతత, ఏకాగ్రత యోగా సాధతోనే సాధ్యమవుతుందన్నారు. సెల్‌ఫోన్ ప్రభావం నుంచి యువత తమ మనస్సును అధీనంలో ఉంచుకోవటానికి సైతం యోగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయులు ఎండీ నసీమ్, బీఎస్‌వీ సీతారామ్ యోగా శిక్షకులు శాంతి మురళీ పాల్గొని మాట్లాడారు. పోస్టర్ కాంపిటీషన్‌లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఆంగ్ల విద్యా బోధన శిక్షణ తరగతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత ఆరు రోజులుగా జరుగుతున్న ఆంగ్ల విద్యా బోధన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ ఈ నెల 12 తేదీన రెండో విడత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో ఇంగ్లీషు విద్యాబోధన అత్యంత అవసరం అన్నారు. నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో విద్యార్థులకు బోధించాలని సూచించారు. మారుతున్న కాలానుగుణంగా అర్థమయ్యేరీతిలో బోధన ఉండాలని కోరారు. కార్యక్రమంలో పలు కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రికెట్ జిల్లా జట్టు ఎంపికకు అపూర్వ స్పందన

విజయవాడ స్పోర్ట్స్:ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్–16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు అపూర్వ స్పందన లభించినట్లు కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథరాజు తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఈ పోటీలకు 170 మంది క్రీడాకారులు హాజరైనట్లు చెప్పారు. కోచ్‌లు వి.శివ, టి.కె.అయ్యప్పస్వామి సమక్షంలో శనివారం సాయంత్రానికి 52 మంది క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. అయితే వీరిలో నాలుగు ప్రాపబుల్స్ నిర్వహించి ఒక జట్టును ఎంపిక చేస్తామన్నారు.

ఆకలిదప్పులు తీరుస్తున్నారు..

- పాత ఆస్పత్రిలో ప్రతిరోజూ 150 మందికి ఉచిత భోజనం
- చల్లటి నీరు, మజ్జిగ అందిస్తున్న వైనం
- అన్న సంతర్పణ సమితి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహణ
- నగరంలో మరో మూడు ప్రాంతాల్లో ఉచిత భోజనం పంపిణీ
- 200 మందికి పైగా ట్రస్టు సభ్యులు
- దాతల సహకారంతో నిర్విరామంగా కొనసాగుతున్న వైనం





రోగులు, అటెండెంట్‌లకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) కూలింగ్ వాటర్ క్యాన్‌లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆకలి, దప్పికలను తీర్చడం కంటే మహాత్కార్యం మరొకటి లేదు. అలాంటి గొప్ప పనికి శ్రీకారం చుట్టారు నగరంలోని అన్న సంతర్పణ సమితి ట్రస్టు సభ్యులు. రెండేళ్లుగా నగరంలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఉచిత భోజన పంపిణీ చేస్తుండగా, తాజాగా పాత ప్రభుత్వాస్పత్రిలోనూ ప్రారంభించారు. ఈ నెల 2న విజయవాడ పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణుల చేతుల మీదగా ప్రారంభమైంది. ప్రతిరోజూ 150 నుంచి 200 మందికి ఉచిత భోజన పంపిణీ చేయడంతో పాటు మజ్జిగ అందచేస్తున్నారు. అంతేకాకుండా వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకూ 50 కూలింగ్ క్యాన్‌ల మంచి నీటిని ప్రతిరోజూ అందచేస్తున్నారు.

ఒక్కో కేంద్రంలో 150 మందికి పైగా....

కోవిడ్ తర్వాత ఉచిత భోజనం పంపిణీ చేయాలనే ఉద్దేశంతో రెండేళ్ల కిందట అన్న సంతర్పణ సమితి ట్రస్టును ఏర్పాటు చేశారు. ఈ ట్రస్టులో రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులు, ఉద్యోగులు ఇలా 200 మంది కిపైగా సభ్యులు ఉన్నారు. వీరందరూ కలిసి తొలుత వన్‌టౌన్ రథం సెంటర్‌లో ప్రతిరోజూ 100 నుంచి 150 మంది దుర్గగుడికి వచ్చే భక్తులకు ఉచితంగా భోజనం అందించడం ప్రారంభించారు. అలా ప్రారంభమైన ఉచిత భోజన పంపిణీని అనంతరం కొత్త వంతెన సెంటర్‌లోని ఆంజనేయగుడి వద్ద, బెంజిసర్కిల్ వద్దకు విస్తరించారు. ఇలా మూడు కేంద్రాల్లో ప్రతిరోజూ ఒక్కో కేంద్రంలో 150 మందికి ఉచితంగా భోజన పంపిణీ చేస్తున్నారు.

రోగుల ఆకలి తీర్చేందుకు.....

అన్న సంతర్పన సమితి సభ్యులు వేసవిలో పాత ఆస్పత్రికి వచ్చే వారి దప్పిక తీర్చేందుకు తొలుత కూలింగ్ మంచినీటిని ఏర్పాటు చేశారు. తొలుత ప్రతిరోజూ 20 క్యాన్‌లు పెట్టేవారు. తర్వాత 50 క్యాన్‌లు పెడుతున్నారు. ప్రసవం కోసం వచ్చే గర్భిణుల వెంట ముగ్గురు, నలుగురు అటెండెంట్స్ వస్తుంటారు. ఆ సమయంలో వారంతా వేచి ఉండటం చూసి ఉచిత భోజనం పెట్టాలని నిర్ణయించారు. అందుకోసం రూ.1.50 లక్షలు వెచ్చించి క్యాబిన్ ఏర్పాటు చేశారు. అంతేకాదు రోగులు భోజనం చేసేందుకు శాశ్వతంగా టెంట్ వేశారు.

నిరంతరం కొనసాగిస్తాం



ఇక్కడ ప్రసూతి విభాగానికి నగరం నుంచే కాకుండా, ఏలూరు, మచిలీపట్నం, భీమవరం వంటి దూర ప్రాంతాల నుంచి కూడా గర్భిణులు వస్తున్నారు. వారి వెంట ఆడవారే ఎక్కువగా ఉంటారు. వారు బయటకు వెళ్లి భోజనం చేయడం ఇబ్బందిగా ఉంటుందని భావించి ఇక్కడ ఉచిత భోజన పంపిణీ శిబిరం ఏర్పాటు చేశాం. ప్రతిరోజు 150 మందికి పంపిణీ చేస్తున్నారు. ట్రస్టు సభ్యులు, దాతల సహకారంతో ఈ కార్యాన్ని నిరంతరం కొనసాగిస్తాం. అంతేకాదు 50 క్యాన్‌ల కూలింగ్‌వాటర్ అందిస్తున్నాం. వేసవిలో చెప్పులు లేకుండా వస్తున్నారు. అలాంటి వారికి చెప్పులు కూడా అందచేస్తున్నాం.

– గుండు దిలీప్, అధ్యక్షుడు అన్న సంతర్పణ సమితి ట్రస్టు

వైద్య విద్యార్థుల పరిశోధనలకు రిటైర్డ్ ఉపాధ్యాయురాలి దేహం



మంగాయమ్మ(ఫైల్)

కృష్ణలంక(విజయవాడతూర్పు): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మల్కీపురం మండలం దిండి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు మంగాయమ్మ (83) అనారోగ్యం కారణంగా గత కొంతకాలంగా నగరంలో తన కుమార్తె ఇంట్లో ఉంటూ శనివారం మృతి చెందారు. దీంతో ఆమె నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రికి, భౌతిక దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు అప్పగించారు. ఆమె ఉద్యోగ విరమణ తర్వాత మహిళా సమాఖ్య నాయకురాలిగా కమ్యూనిస్టు పార్టీలో బాధ్యతలు నిర్వహించారు. భర్త దేవ ముసలయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకునిగా పని చేసి ఆరేళ్ల క్రితం మృతి చెందారు. ఆమె కుమార్తె డాక్టర్ డి.సుజాత రెడియాలజిస్టుగా పనిచేస్తుండగా అల్లుడు డాక్టర్ వి.సదానందం మానసిక వైద్య ఆచార్యులుగా, కుమారులు దేవ రాజేంద్రప్రసాద్ న్యాయవాదిగా, దేవ రాధాకృష్ణ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.

భౌతికదేహాన్ని సందర్శించిన ప్రముఖులు..

మంగాయమ్మ భౌతికదేహంపై సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.దుర్గాభవాని ఎర్రజెండా కప్పారు. అలిండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, సీపీఐ నాయకులు జి.కోటేశ్వరరావు, నక్కా వీరభద్రరావు, ఎం.సాంబశివరావు, పి.దుర్గాంబ, న్యాయవాది రామ్‌ప్రసాద్, సామాజిక కార్యకర్తలు అరుణ్‌కుమార్, వేణుగోపాల్, కుటుంబసభ్యులు భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు



విద్యార్థినికి ప్రభుత్వ సహాయం అందిస్తున్న కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రతిభకు సత్కారం–జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం శనివారం 64వ డివిజన్ కండ్రిక బీవీ సుబ్బారెడ్డి హైస్కూల్లో నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన కె.ప్రణతిసాయి(584) హైస్కూల్‌లో ప్రథమ స్థానమే కాకుండా నియోజకవర్గం స్థాయిలో రెండో స్థానం, జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. ఆ విద్యార్థినికి కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ ప్రభుత్వం అందచేసిన మూడు వేల రూపాయల నగదు బహుమతితో పాటు, గోల్డ్‌మెడల్ అందచేశారు. 571 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన ఆర్.లక్ష్మియశ్వతకు రెండువేల రూపాయల నగదు, రజిత మెడల్, 544 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిన ఇ.మధుప్రియకు వెయ్యి రూపాయల నగదు, కాంస్యమెడల్ అందచేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎల్.నాగేశ్వరి, వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, పార్టీ నాయకులు అక్కిశెట్టి నారాయణ,వెంకటేశ్వరమ్మ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి

మేయర్ భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): అనేక రంగాల్లో ఇప్పటికే అభివృద్ధి సాధించి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 5వ ర్యాంక్, స్టేట్ క్యాపిటల్ కేటగిరిలో ప్రథమ స్థానం వంటి అనేక అవార్డులు పొందామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల విజ్ఞాన యాత్రలో కార్పొరేటర్లు తాము తెలుసుకున్న విషయాలు, అనుభవాలను పంచుకునేందుకు శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. విజ్ఞాన యాత్ర అనుభవాలు, అధ్యయనాన్ని దృష్టిలో పెట్టుకుని కార్పొరేటర్లు అందరూ సమష్టి కృషితో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఆయా నగరాల్లో క్లీన్ అండ్ గ్రీన్, జీరో ప్లాస్టిక్ విధానాలను కార్పొరేటర్ల బృందం పరిశీలించిందని చెప్పారు. మన నగరంలోనూ జీరో ప్లాస్టిక్ అమలు చే సేందుకు ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు వివిధ కార్యక్రమాలను చేపడతామన్నారు. మిగిలిన నగరాలతో పోల్చి చూస్తే విజయవాడ నగరం అభివృద్ధి పథంలో ఉందన్నారు. విజ్ఞాన యాత్ర ద్వారా తెలుసుకున్న అనేక సంస్కరణలను రానున్న రోజుల్లో నగరంలోని వివిధ డివిజన్లలో అమలు చేసి మరింతగా అభివృద్ధి సాధించే దిశగా కార్పొరేటర్లు అందరూ కృషి చేయాలని కోరారు.

డివిజన్లకు బ్రాండ్ అంబాసిడర్లు కావాలి...

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లోని నగరాల్లో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, సంస్కరణలను స్టడీ చేసిన కార్పొరేటర్లు అభినందనీయులన్నారు. అక్కడ అధ్యయనం చేయటం ద్వారా నేర్చుకున్న అంశాలను మీమీ డివిజన్లలో అమలు చేసి అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్లు కావాలని ఆకాంక్షించారు. ఈ విజ్ఞాన యాత్రకు సుమారు రూ.47 లక్షలు ఖర్చు అయిందని, తద్వారా ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఐడియాస్‌తో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సాధ్యమవుతుందన్నారు. ఒక వైపు కార్పొరేటర్లు, మరో వైపు అధికారులు ఈ విజ్ఞాన యాత్రను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు.

జాతీయ స్థాయిలో గుర్తింపుకు కృషి...

కార్పొరేటర్ల బృందానికి నేతృత్వం వహించిన వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేటర్ల విజ్ఞాన యాత్ర విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ యాత్ర ద్వారా తెలుసుకున్న అంశాలతో నగరానికి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు అవకాశాన్ని కల్పిస్తూ అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందించిన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. విజ్ఞాన యాత్రలో పాల్గొన్న కార్పొరేటర్లు మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాలలోని పలు నగరాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే ప్రజోపకరమైన ప్రాజెక్టులను అమలు చేస్తున్న విధానం, పన్నుల మదింపు, వసూలు చేస్తున్న తీరు, ఆయా నగరాల అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ విధానం, నీటి శుద్ధి కేంద్రాలు వంటి పలు అంశాలతోపాటు ఆదాయ ఒనరులపైకూడా సమగ్ర అధ్యయనం చేశామని వివరించారు. సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, విజ్ఞాన యాత్ర సమన్వయకర్తగా వ్యవహరించిన వీఏఎస్ డాక్టర్ రవి చంద్, టూర్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజినీర్ కె.యేసుపాదం పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



పీవీ సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న బాలాజీకుమార్, పవన్‌కుమార్ తదితరులు

విజయవాడ కల్చరల్:సాంస్కృతిక కళా సంస్థలు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని సీనియర్ జర్నలిస్ట్ బాలాజీకుమార్ అన్నారు. ఇందిరా ఈవెంకట్స్, పుష్పాంజలి రిథమ్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సామాజిక వేత్త, సంఘ సేవకులు డాక్టర్ డాక్టర్ పీవీ సుబ్బారావు సామాజిక సేవలను గుర్తించి ఆత్మీయ సత్కారం, వాగ్గేయకార కీర్తనల కార్యక్రమం నిర్వహించారు. బాలాజీకుమార్ మాట్లాడుతూ డాక్టర్ పీవీ సుబ్బారావు వైద్యునిగా సుదీర్ఘకాలం సేవలను అందించారని చెప్పారు. సామాజిక సేవలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేద రోగులకు వైద్యం, మందులు అందించినట్లు తెలిపారు. వారి సేవలను గుర్తు చేసుకుంటూ డాక్టర్ పీవీ సుబ్బారావు దంపతులను నిర్వాహకులు సత్కరించారు. ఇందిరా ఈవెంట్స్ నిర్వాహకులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ రాధామాధవి, ఇంద్ర, ఇందిరా లాలిత్య వివిధ సాంస్కృతిక, కళా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సత్కారం అందుకున్న డాక్టర్ పీవీ సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యంగా వైద్యరంగంలో ఉన్నవారు వృత్తిని దైవంగా భావించాలని తెలిపారు. పుష్పాంజలి రిథమ్స్‌కు చెందిన గాయనీ గాయకులు పలు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు.

సర్వాంగ సుందరంగా పార్కుల అభివృద్ధి


ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పార్కు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం అందించేలా నియోజకవర్గంలో పార్కులను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేశామని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 63వ డివిజన్ ఉడాకాలనీలో రూ.75 లక్షలతో అభివృద్ధి పరిచిన రెండు పార్కులను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు మోదుగుల తిరుపతమ్మ, అలంపూరు విజయలక్ష్మితో కలిసి శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. నగర అభివృద్ధిలో భాగంగా దశల వారీగా పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పలుచోట్ల ప్రజల వినతుల మేరకు రూ.4.15 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో దాదాపు 15 ఎకరాల విస్తీర్ణంలో నిరుపయోగంగా ఉన్న 8 ఖాళీ స్థలాలను పార్కులుగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వ స్థలాల పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఇందులో భాగంగా సాయిబాబా గుడి వద్ద పార్కును విశాలమైన వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్‌తో పాటు చిన్నారులకు ఆట వస్తువులు, పచ్చని గార్డెనింగ్ తో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 80 శాతం పార్కుల పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. వాంబేకాలనీలో ఐకానిక్ పార్కు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పాయకాపురం చెరువును రూ.2.80 కోట్లతో అభివృద్ధి పరచగా, బోటింగ్ సదుపాయం కూడా కల్పించే దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఎక్సెల్‌పార్కులో రూ.50 లక్షల సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టగా, మరో రూ.1.25 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. వీటితోపాటు రూ.8లక్షలతో ప్రకాష్ నగర్ పార్కు, రూ.14 లక్షలతో తెలుగుతల్లి పార్కు, కండ్రిక రామాలయం వీధిలో రూ.72 లక్షల నిధులతో రెండు పార్కులను అభివృద్ధి పరచడం జరిగిందన్నారు. అనంతరం పార్కులో తెలుగుతల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే విష్ణు, నున్న పోలీసు స్టేషన్ సీఐ కె.శ్రీనివాసరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈఈ (పార్కులు) ఏఎస్ఎన్ ప్రసాద్, వీఎంసీ ఉద్యానవనశాఖాధికారి (ఏడిహెచ్) సీహెచ్ శ్రీనివాసులు, డీఈ(ఇంజనీరింగ్) గురునాథం, విక్టర్, నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్,అలంపూరు విజయ్, సీహెచ్ రవి, ఉమ్మడి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వివిధ వృత్తుల్లోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి విచ్చేసి భవన నిర్మాణ కార్మికులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు, సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి బి.గోవింద్ మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 19న ధర్నాచౌక్‌లో ధర్నా చేపడుతున్నామని వివరించారు. సీఐటీయూ నాయకుల వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు వాటి పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దలు, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఐటీయూ నాయకులు బాబూరావు, సత్యనారాయణ, మురహరి, బాబు, నాగార్జున, పవన్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ):క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణకు ప్రజలంతా సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. హోటళ్లు, వ్యాపార, వాణిజ్య కార్యాలయాల నిర్వాహకులు, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక 26వ డివిజన్ పరిధిలో గల సాంబమూర్తి రోడ్, అల్లూరి సీతారామరాజు వంతెన దగ్గర స్థానికులు కాలువలో చెత్త వేయడాన్ని గమనించిన కమిషనర్ వారిని హెచ్చరిస్తూ జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. నగరంలో ఎక్కడైనా రోడ్లపై చెత్త వేస్తే వారికి జరిమానాలు విధించాలని ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జక్కుల ప్రశాంతికుమారి, ఆర్.రామకృష్ణ ప్రసాద్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ముదిగొండ్ల జయకృష్ణ కిషోర్ నగరంలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ భార్య శృతి, ఇద్దరు పిల్లలతో కలసి పసుపుతోట, జీరోలైన్‌లో నివాసముంటున్నారు. ఈ నెల 12న బయటకు వెళ్లిన భర్త మధ్యాహ్నం 12 గంటల సమయంలో దుర్గాపురం, హైస్కూల్‌రోడ్డులోని టైలరింగ్ షాపు నిర్వహిస్తున్న అతని తండ్రి స్నేహితుడైన శ్రీనివాసరావు వద్దకు వెళ్లి అతని ఫోన్ నుంచి భార్యకు ఫోన్ చేసి రూ. 500 ఫోన్‌పే చేయాలని, ఒక గంటలో ఇంటికి వస్తానని చెప్పడంతో భార్య డబ్బులు పంపించింది. అనంతరం రాత్రి అయినా ఇంటికి రాలేదు. గతంలో కూడా జయకృష్ణ కిషోర్ ఇంట్లో చిన్న చిన్న గొడవలు జరిగినప్పుడల్లా ఇంట్లో నుంచి వెళ్లిపోయి సాయత్రానికి వచ్చే వాడు. లేదా దేవినగర్‌లో ఉండే అతని తల్లి ఇంటికి వెళ్లి మరుసటి రోజు వచ్చేవాడు. అదే విధంగా వెళ్ళి ఉంటాడని భర్త తల్లికి ఫోన్ చేయగా రాలేదని చెప్పడంతో తెలిసిన వారు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీమా నగదు అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్):వైఎస్సార్ బీమాతో ధీమా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. బావాజీ పేట లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మల్లు నారాయణ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద లక్ష రూపాయలు నగదు శనివారం అందించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కె.శివ, కన్వీనర్ కొండాయ గుంటరాము, కొండా ఏసు పాదం, వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

63వ డివిజన్లో ఎమ్మెల్యే జన్మదినోత్సవం



పాయకాపురం(విజయవాడరూరల్): ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు జన్మదినోత్సవం 63వ డివిజన్ ఉడా కాలనీలో పార్కు వద్ద అభిమానుల ఆనందోత్సాల మధ్య శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వేదపండితులు మంత్రాలు చదివి ఎమ్మెల్యేని ఆశీర్వదించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు మోదుగుల తిరుపతమ్మ, అలంపూరు విజయలక్ష్మీ, పార్టీ నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సిహెచ్ రవి, అలంపూరు విజయ్, ఉమ్మడి వెంకట్రావ్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.